నమస్తే తెలంగాణ
సూర్యాపేట
I | నల్లగొండ, మంగళవారం 6 మే 2025 | SURYAPET

## 7 నుంచి ఆర్టీసీ సమ్మె యథాతథం

● జేఏసీ నాయకుల పోస్టర్ ఆవిష్కరణ



ఆర్టీసీ సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

సూర్యాపేట అర్బన్, మే 5 : ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె యథాతథంగా కొనసాగుతుందని సూర్యాపేట ఆర్టీసీ డిపో జేఏసీ చైర్మన్ మాచర్ల లచ్చయ్య అన్నారు. ఈ సందర్భంగా సోమవారం డిపోలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన హాజరై సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 7 తేదీన ఉదయం మొదటి బస్సు సర్వీస్ నుంచే కార్మికులు సమ్మెలో పాల్గొంటారని చెప్పారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెపై వెనక్కి తగ్గేది లేదన్నారు. పోస్టర్ ఆవిష్కరించిన వారిలో జేఏసీ వైస్ చైర్మన్ పనాస మధుసూదన్‌రావు, కన్వీనర్ వాంకుడోతు సేవ్యా ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

## కుటుంబ సర్వే రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలి

● కలెక్టరేట్ ఎదుట టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన.. కలెక్టర్‌కు వినతి

రామగిరి, మే 5 : గతేడాది నవంబర్ 6 నుంచి 18వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బందికి ప్రభుత్వం వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసాచారి, కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వేను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని దేశ వ్యాప్తంగా చేయడానికి సిద్ధమైందన్నారు. ఉపాధ్యాయులు శ్రమతో పటిష్టంగా సర్వే నిర్వహిస్తే ఇంత వరకు ప్రభుత్వం సర్వే రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే వేతనం ఇవ్వకపోతే నల్లగొండ జిల్లా నుంచి ప్రత్యేక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి, కోశాధికారి వడ్త్యా రాజు, ఎడ్ల సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్, రాకేశ్ పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ కుదేలు

## కుప్పకూలిన ప్లాట్లు, వ్యవసాయ భూముల ధరలు

**అమ్మేవారున్నా కొనేవాళ్లు కరువు**

**అత్యవసరమైతే అడికి పావుశేరు లెక్కన బేరాలు**


**అమాంతం పడిపోయిన రిజిస్ట్రేషన్లు**

**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇదే పరిస్థితి**

**ప్రజల్లో తగ్గిపోతున్న కొనుగోలు శక్తి**

**క్రయవిక్రయాలు లేక కష్టాల్లో రియల్ ఎస్టేట్ ఏజెంట్ల కుటుంబాలు**

*సూర్యాపేట-ఖమ్మం రహదారి వెంట రామయ్య(పేరు మార్చాం) అనే వ్యక్తికి నాలుగెకరాల భూమి ఉంది. నాలుగేండ్ల క్రితం హైదరాబాద్ నుంచి ఒకరు వచ్చి ఎకరాకు రూ.60 లక్షలు ఇస్తాం.. భూమి అమ్ముతవా అని అడిగితే.. 'నాకేం అవసరం లేదు. అమ్మను' అన్నాడు. ఇటీవల రామయ్యకు డబ్బు అత్యవసరం ఉండి అమ్ముకునేందుకు మార్కెట్లో పెడితే నాలుగు నెలల పాటు అలాగే ఉంది. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఎకరం రూ.35లక్షలకు మించి వెళ్లే పరిస్థితి లేదని చెప్పారు. ఎకరం రూ.34 లక్షల చొప్పున కొనుగోలు చేసేందుకు ఒకరు రావడంతో మల్లయ్య విధిలేక అదే ధరకు రెండెకరాలను విక్రయించాడు. సాగు భూముల ధరలు ఏ స్థాయిలో పడిపోయాయో ఈ ఘటన తేటతెల్లం చేస్తున్నది.*



సూర్యాపేట, మే 5 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలింది. సాగుభూముల క్రయ విక్రయాలు మచ్చుకు కూడా కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో అభివృద్ధి ఆనవాళ్లు లేకపోవడం, ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోవడంతో ప్లాట్లు, సాగు భూములు కొనేవారు కరువయ్యారు. ప్లాట్ల విషయంలో అయితే.. అమ్మేందుకు పదుల సంఖ్యలో ఉంటుంటే కొనేటోళ్లు ఒకరిద్దరు కూడా ముందుకు రావడం లేదు.

బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో భూముల ధరలు సిరులు కురిపించాయి. రియల్ ఎస్టేట్ వెంచర్లు పెద్దఎత్తున వెలిశాయి. ప్రజలు కూడా అదే స్థాయిలో ప్లాట్లు కొనుగోలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త వెంచర్లు కనపడడం లేదు. ఎవరైనా ఆపద ఉండి డబ్బు కోసం ప్లాట్లు అమ్ముకుందామన్నా కొనుగోలు చేసేందుకు ఎవరూ రావడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో చుక్కనీళ్లు రాక ఎడారిని తలపించిన భూములకు కేసీఆర్ రైతు బంధు, పుష్కలంగా నీళ్లు, 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో రైతులు పంటలు బాగా పండించారు. దాంతో అప్పటివరకూ రూ.వేలల్లో పలికిన భూముల ధరలు లక్షలకు చేరాయి. ప్రస్తుతం కొనుగోలు చేసేవారు లేక ధరలు అమాంతం పడిపోయాయి.

అలివి కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలమవుతున్నది. సాగు నీళ్లు లేవు. కరెంటు లేదు. రుణమాఫీ కాలేదు. రైతు భరోసా రాలేదు. ధాన్యానికి బోనస్ అందలేదు. ఇలా అన్నింటా రైతులు, ఇతర రంగాల వారు దెబ్బతిన్నారు. ప్రజా జీవనం ఉమ్మడి రాష్ట్రంలో మాదిరి అతలాకుతం అవుతున్నది. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధి, తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన సంక్షేమ ఫలాలతో ప్రజల చేతిలో డబ్బులు కనపడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో పాలనా వైఫల్యం, నిర్లక్ష్యం వెరసి మళ్లీ ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు దాపురించి ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోయింది. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలింది. గతంలో నిత్యం వందకుపైగా డాక్యుమెంట్లు వచ్చిన రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నేడు.. ఎవరైనా వస్తే బాగుండు అని ఎదురుచూసే పరిస్థితులు దాపురించాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం మీద ఆధారపడి జీవనం సాగించిన వేలాది మంది ఏజెంట్లకు ఉపాధి కరువైంది. ఆయా కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నమయ్యాయి.

### గణనీయంగా పడిపోయిన ప్లాట్ల ధరలు

గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఓ విజన్‌తో ప్రాజెక్టులు నిర్మించి సాగు నీటిని తెస్తే రైతులకు భూములకు విలువ పెంచారు. మరోవైపు కనీవిని ఎరుగని రీతిన అభివృద్ధితో అన్ని ప్రాంతాల్లో డిమాండ్ పెరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమం నిలిచిపోవడంతో జిల్లా కేంద్రంతోపాటు కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి పట్టణాల్లో గానీ, మండల కేంద్రాల్లో గానీ ఒక్కటంటే ఒక్క వెంచర్ కూడా కొత్తగా రాలేదు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గతంలో కుడకుడ రోడ్డు, గాంధీనగర్, దురాజ్‌పల్లి ప్రాంతాల్లో గజం రూ.15 వేల నుంచి 20 వేల వరకు పలికిన చోట కూడా నేడు విక్రయాలు లేవు. డబ్బులు అత్యవసరం ఉన్న వాళ్లు గజం రూ.10వేలకు అమ్ముకునేందుకు కొనేవాళ్లు లేరు. సూర్యాపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అప్పట్లో రోజుకు 70 నుంచి 100 రిజిస్ట్రేషన్లు కాగా, నేడు ఒకటీ రెండు కూడా రావడం లేదు.

### సాగు భూముల పరిస్థితి మరీ దారుణం

గత ఉమ్మడి రాష్ట్రంలో బీళ్లుగా ఉన్న భూముల ధరలు ఎకరాకు ఆయా ప్రాంతాలను బట్టి రూ.30 వేల నుంచి 70 వేల వరకు పలికేవి. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించి నీళ్లు తీసుకురావడంతో బీడు భూములు సిరులు పండించాయి. రైతుల చేతిల్లో డబ్బు కనపడింది. జరిగిన అభివృద్ధికి అనుగణంగా భూములు ధరలు పెరిగాయి. ఎకరా రూ.30 లక్షల నుంచి కోటి రూపాయల వరకు పలికాయి. కొంతమంది రైతులు తమకు ఉన్న భూమిలో ఒకటో, రెండో ఎకరాలు అమ్మి ఇల్లు నిర్మించుకోవడం, ప్లాట్లు కొనుగోలు చేయడం, పిల్లలను కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదివించడం, కొత్త వాహనాలను కొనుగోలు చేయడం వంటివి చేసి సౌకర్యవంతమైన జీవనం గడిపారు. కానీ నేడు నీళ్లు రాక పంటలు ఎండిపోతుండడంతో మళ్లీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదిన్నర క్రితం వరకు రూ.30 లక్షల నుంచి కోటి రూపాయలు పలికిన భూములు నేడు అమ్ముకుందామంటే కొనేవాళ్లు దొరకడం లేదు. ఎవరైనా కొనేందుకు వచ్చినా అడ్డికి పావుసేరు లెక్క అడుగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా వైఫల్యం కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం నాశనమై తామంతా రోడ్డున పడే పరిస్థితులు దాపురించాయని ఆ రంగంపై ఆధారపడిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కొనేవారు ఒక్కరుంటే.. అమ్మేవాళ్లు వందల మంది



గత ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక ఊపు ఊపింది. ప్రస్తుతం పరిస్థితి దారుణంగా ఉంది. అమ్మేవాళ్లు వంద మంది ఉంటే కొనేవాళ్లు ఒక్కరుంటున్నారు. అమ్మేవాళ్లు నష్టానికి అమ్ముకోలేకపోతున్నారు. కొనేవాళ్లు ధర పెట్టడానికి ఆసక్తి చూపడం లేదు. ప్లాట్లు, ఇండ్లు అమ్ముడు పోవడం లేదు. గతంలో రోజుకు కనీసం ఒకటి, రెండు ప్లాట్లు అయినా అమ్ముడుపోయేవి. ప్రస్తుతం రెండు నెలలకు ఒక్క ప్లాటు కూడా అమ్మలేకపోతున్నాం. మాలాంటి ఏజెంట్ల కుటుంబాలు గడిచే పరిస్థితి లేదు.

*-గన్నోజు భరత్, రియల్ ఎస్టేట్ ఏజెంట్, సూర్యాపేట*

### అమ్మేవారున్నా కొనేవాళ్లు లేరు



రియల్ ఎస్టేట్ పరిస్థితి రోజురోజుకూ పడిపోతున్నది. గతంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో అభివృద్ధి పథంలో పయనించడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. హైదరాబాద్ నుంచి కూడా వచ్చి సూర్యాపేటలో ప్లాట్లు, ఇండ్లు కొనుగోలు చేశారు. రోజూ వందల రిజిస్ట్రేషన్లు అయ్యేవి. ప్రస్తుతం అమ్మేవారు ఉన్నా కొనేవారు లేరు. రిజిస్ట్రేషన్లు లేక దస్తావేజు షాపులన్నీ వెలవెలబోతున్నాయి. కుటుంబాలు సాగే పరిస్థితి లేదు. దీనికితోడు ప్రభుత్వం స్లాట్ రిజిస్ట్రేషన్ తీసుకొస్తామని చెప్పున్నది. అదే కనుక జరిగితే మా కుటుంబాలు రోడ్డున పడుతాయి. ప్రభుత్వం పునరాలోచించి స్లాట్ రిజిస్ట్రేషన్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి.

*- తంగెళ్ల వెంకట్‌రెడ్డి, డాక్యుమెంట్ రైటర్, సూర్యాపేట*



పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, రైల్వే ఎస్పీ చందనా దీప్తి, పోలీస్ అధికారులు

## రూ.10కోట్ల గంజాయి ధ్వంసం

● పలు కేసుల్లో 2010కిలోలు స్వాధీనం

● గంజాయి రవాణాపై ఉక్కుపాదం

● డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, రైల్వే ఎస్పీ చందనా దీప్తి

భువనగిరికలెక్టరేట్, మే 5 : అక్రమంగా తరలిస్తున్న గంజాయిపై ఉక్కుపాదం మోపి, కఠిన చర్యలు చేపడుతున్నట్లు డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, రైల్వే ఎస్పీ చందనా దీప్తి అన్నారు. మండలంలోని తుక్కాపురం గ్రామ పరిధిలోని రోమా ఇండస్ట్రీలో 2024-25కు సంబంధించి 74 కేసుల్లో పట్టుబడ్డ రూ.10కోట్ల 5లక్షల 6వేల750 విలువైన 2010.135కేజీల గంజాయిని సోమవారం కాల్చివేసి అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సికింద్రాబాద్, రూరల్, ఖాజీపేట డివిజన్ల పరిధిలో నమోదైన 74 కేసులకు సంబంధించి పలు కేసుల్లో ఎక్కువ మొత్తంలో గంజాయిని స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. గతానికి భిన్నంగా గంజాయిని అధిక మొత్తంలో పట్టుకోవడంలో సిబ్బంది కృషి ఎనలేనిదన్నారు. గంజాయి అక్రమ రవాణాకు విక్రయదారులు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని, వారి వ్యూహాలకు దీటుగా ప్రతివ్యూహాన్ని రచించి పోలీసులు కట్టడి చేస్తున్నారని ప్రశంసించారు. గంజాయిని పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపడుతన్నట్లు ఆమె పేర్కొన్నారు. 2024-25 ఏడాదిలో ఇప్పటి వరకు సికింద్రాబాద్ పరిధిలో 49 కేసుల్లో రూ.7,09,61,450 విలువైన 1419.229 కేజీలు, సికింద్రాబాద్ రూరల్ పరిధిలో 5 కేసుల్లో రూ.50,42,100 విలువ గల 100.842 కేజీలు, ఖాజీపేట డివిజన్‌లో 20కేసుల్లో రూ.2,45,03,200విలువ గల 490.064 కేజీల గంజాయిని ధ్వంసం చేశామని చెప్పారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా, నియంత్రణ, అసాంఘిక, శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా సికింద్రాబాద్, ఖాజీపేట రైల్వేస్టేషన్లతో పాటు చర్లపల్లి, జనగాం, భువనగిరి తదితర రైల్వేస్టేషన్‌లలో కొత్తగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ రూరల్, అర్బన్ రైల్వే డీఎస్పీలు కె.శ్రీనివాస్‌రావు, జావిద్, ఖాజీపేట డీఎస్పీ టి.కృపాకర్, సికింద్రాబాద్, కాజీపేట రైల్వే ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించాలి

● మిర్యాలగూడలో లబ్ధిదారుల ధర్నా

● డ్రా తీసి రెండేండ్లు అయినా ఇండ్లు ఇవ్వడం లేదని ఆవేదన



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న లబ్ధిదారులు

మిర్యాలగూడ, మే 5 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. గతంలోనే డ్రా తీసి లబ్ధిదారులను గుర్తించినా ఇప్పటికీ ఇండ్లు అప్పగించకపోవడంతో అన్యాయమంటూ మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ డ్రా పద్ధతిలో లబ్ధిదారులను గుర్తించి రెండేండ్లు కావస్తున్నా ఇంతవరకు ఇండ్లు కేటాయించడం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పట్టణంలో 566 డబుల్ బెడ్రూమ్ ఇండ్లు సిద్ధంగా ఉన్నప్పటికీ కేటాయించకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ పేర్లను తొలగించి వేరే వారిని ఎంపిక చేసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు నాజర్‌వలీ, నస్రీన్, రేష్మా, రెహానా, బుర్హాన్, రహీమున్నీసా పాల్గొన్నారు.

## భరోసా కల్పిస్తేనే విధుల్లోకి వస్తాం

● కాటేపల్లి పీఈఎల్ కంపెనీ ఎదుట కార్మికుల ధర్నా



కంపెనీ గేటు ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మోటకొండూర్, మే 5 : మండలంలోని కాటేపల్లి గ్రామ సమీపంలో గల ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ (పీఈఎల్)గేటు ఎదుట కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కంపనీలో జరిగిన పేలుడు నేపథ్యంలో కార్మికులు తమ భద్రతతోపాటు పలు సమస్యలకు పరిష్కారం చూపి భరోసా కల్పించిన తర్వాతనే విధులకు హాజరవుతామని తెలిపారు. ప్రాణాలకు భరోసా కల్పించాలని, కనీస వేతనం రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని భారాన్ని తగ్గించి రోజూ 8 గంటలే పని ఉండేలా చూడాలన్నారు. డ్యూటీలో ఇద్దరు కార్మికులను ఉంచాలని, ఒక డాక్టర్‌ను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని కోరారు. కాంట్రాక్ట్ వ్యవస్థను తొలగించి కంపెనీ నుంచే ప్రతి ఒక్కరిని తీసుకోవాని, మెరుగైన ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. పనిలో చేరిన వెంటనే ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో జీతాలు ఇవ్వాలని, పీడీఏ పాయింట్ ఇవ్వాలని, కార్మికులకు భోజన హాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించిన తరువాతనే విధుల్లోకి వస్తామని ధర్నా చేపట్టారు. కంపెనీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ ధర్నా వద్దకు వచ్చి కార్మికుల వినతిని స్వీకరించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్మికులు జి.నాగిరెడ్డి, వాకిటి నవీన్‌రెడ్డి, కాదూరి ఏలేందర్, బాల్ద సిద్దులు, నాగార్జున, ప్రవీణ్, చందు, నాగరాజు పాల్గొన్నారు.

# పరీక్షలు ఎప్పుడు?

## డిగ్రీ విద్యార్థుల ఎదురుచూపులు

**ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని పరీక్షలు బహిష్కరించిన యాజమాన్యాలు**

**ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ కళాశాలలకు రూ.120కోట్లపైగా బకాయిలు**

**ఉన్నత విద్యా కోర్సుల ప్రవేశ పరీక్షలకు సమీపిస్తున్న గడువు**

**ప్రభుత్వం నుంచి స్పందన లేక ఆందోళనలో విద్యార్థులు**



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని కోరుతూ నల్లగొండలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థులు, వివిధ కళాశాలల యాజమాన్యాలు (ఫైల్)

రామగిరి, మే 5 : నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీతోపాటు రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల పరిధిలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు ప్రభుత్వం కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి పడింది. వాటి విడుదల కోసం గతేడాది అక్టోబర్ నుంచి ఆయా కళాశాలల యాజమాన్యాలు ఆందోళన చేస్తూనే ఉన్నాయి.

అప్పులు చేసి కళాశాలల నిర్వహణ చేయలేమంటూ గత నెల నుంచి జరుగాల్సిన పలు సెమిస్టర్లు, ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలను నిర్వహించకుండా నిరసన వ్యక్తం చేస్తున్నాయి. 2025-26 విద్యా సంవత్సరంలో పలు కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే సెట్ పరీక్షలు సమీపిస్తుండడంతో తమ డిగ్రీ పరీక్ష నిర్వహణపై సందిగ్ధం తొలగక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

డిగ్రీ పరీక్షల నిర్వహణపై సందిగ్ధత తొలగడం లేదు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం పరీక్షలు నిర్వహించలేమని చేతులెత్తేశాయి. దాంతో మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జరుగాల్సిన డిగ్రీ పరీక్షలు ప్రశ్నార్థకంగా మారాయి. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ చివరి సెమిస్టర్‌తో పాటు పలు సెమిస్టర్ల విద్యార్థులకు ఏప్రిల్ 2 నుంచి ప్రాక్టికల్స్ జరుగాల్సి ఉండగా వాయిదా పడ్డాయి. గత నెల 11 నుంచి జరుగాల్సిన డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలనూ వాయిదా వేశారు. ప్రభుత్వం ఇప్పటి వరకు చర్చలు జరుపకపోకపోవడం, రీయింబర్స్‌మెంట్ విడుదలపై స్పష్టత ఇవ్వకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు పరీక్షల నిర్వహణకు సుముఖంగా లేవు. ఎంజీయూ పరిధిలో మే 15 వరకు జరుగాల్సిన పరీక్షలు అధికారులు వాయిదా వేయగా తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారు అనేదానిపై ప్రకటనేమీ చేయలేదు. దాంతో డిగ్రీ విద్యార్థులు గందరగోళంలో పడ్డారు.

### ఉమ్మడి జిల్లాలో రూ.120కోట్లకుపై బకాయిలు..

ఎంజీయూ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రూ.120కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎంజీయూ పరిధిలో గతంలో 140 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉండగా.. కొవిడ్ ప్రభావం, దోస్త్ ఆన్‌లైన్ విధానం, ఇతర కారణాలతో ప్రస్తుతం కాలేజీల సంఖ్య 68కి చేరింది. వాటిలో 14వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఫైనల్ ఇయర్ వాళ్లు 6వేలకు పైగా ఉన్నారు. రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండడంతో కళాశాలల అద్దె, వర్సిటీ ఫీజులు, మున్సిపాలిటీ ట్యాక్స్, అధ్యాపకుల వేతనం, నిర్వహణ ఖర్చు చెల్లించలేక అప్పుల పాలవుతున్నామని ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు వాపోతున్నాయి.

### సమీపిస్తున్న ప్రవేశ పరీక్షలు..

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఎడ్‌సెట్, ఐసెట్, లాసెట్ వంటి పరీక్షల నిర్వహణ తేదీలు ఇప్పటికే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే డిగ్రీ పరీక్షల నిర్వహణ ఎప్పుడు? అనేది మాత్రం తెలియడంలేదు. మరోవైపు సెట్ పరీక్షలు సమీపిస్తుండడంతో ఫైనలియర్ విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

### పరీక్షలు నిర్వహించి ఆదుకోవాలి

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోడంతో మేము ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే విడుదల చేసి కళాశాలల యాజమాన్యానికి భరోసా కల్పించాలి. యూనివర్సిటీ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో ప్రకటించడం లేదు. పలు కోర్సుల్లో ప్రవేశాల కోసం పరీక్షలు సమీపిస్తుండటంతో ఆందోళన చెందుతున్నాం. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలి.

*- మంజుల , ఫైనల్ ఇయర్ విద్యార్థిని, నీలగిరి డిగ్రీ అండ్ పీజీ కళాశాల*

### పట్టించుకోకపోతే కాలేజీలు మూసేస్తాం



ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి. కళాశాలలను బంద్ చేసి, పరీక్షలు బహిష్కరించి నిరసన తెలుపుతున్నా స్పందించకపోవడం బాధాకరం. కళాశాలలు నడుపలేకపోతున్నాం. అవసరమైతే ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను శాశ్వతంగా మూసివేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం అర్థం చేసుకుని సమస్యను పరిష్కరించి ఆదుకోవాలి.

*- మారం నాగేందరరెడ్డి, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ అధ్యక్షుడు*

### ప్రభుత్వం ఆదేశిస్తేనే పరీక్షలు



ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ఆందోళన చేస్తుండడంతోనే పరీక్షలను ఎంజీయూ పరిధిలో ఇప్పటికే రెండు సార్లు వాయిదా వేశాం. ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకే మళ్లీ నిర్వహణ తేదీలు ప్రకటించే అవకాశం ఉంది. ఉత్తర్వులు లేకుండా పరీక్షల పునఃనిర్వహణ షెడ్యూల్ ప్రకటించి విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దనే తేదీలు వెల్లడించడం లేదు.

*-జి.ఉపేందర్‌రెడ్డి, ఎంజీయూ సీఓఈ*